నమస్తే తెలంగాణ

మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్

5 | శుక్రవారం 17 మే 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


# వృథాగా మిషన్ భగీరథ నీరు



ట్యాంకు వద్ద పడిన బుంగ



వాటర్ ట్యాంకు నుంచి వృథాగా పోతున్న తాగునీరు

కన్నెపల్లి, మే 16 : భీమిని మండలం వీగాం పంచాయతీలోని ఎస్సీ కాలనీలో నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ కింద బుంగ పడి పెద్ద ఎత్తున తాగునీరు వృథాగా పోతున్నది. ఒక పక్క తీవ్ర ఎండలతో నీటి కోసం ప్రజలు అల్లాడుతుంటే లక్షల లీటర్ల నీరు వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా ఇలాగే ఉన్నా.. అటువైపు అధికారులు చూడకపోవడంపై మండిపడుతున్నారు. కొన్ని కాలనీలకు నీరు సక్రమంగా రావడం లేదని, ఇంకో రెండు రోజులు ఇలాగే జరిగితే వాటర్ ట్యాంక్ సైతం కూలిపోయే ప్రమాదం ఉందని పలువురు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# 18న జడ్పీ సర్వసభ్య సమావేశం

ఆసిఫాబాద్ టౌన్, మే 16 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జడ్పీ సమావేశంలో ఈ నెల 18న నిర్వహించనున్నట్లు జడ్పీ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి ఈ అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారులు తమ నివేదికలతో హాజరు కావాలని తెలిపారు.

# అవార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్ టౌన్, మే 16 : ప్రతిష్టాత్మక కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్రస్థాయి అవార్డుల కోసం అర్హులైన చేనేత కార్మికుల నుంచి దరఖాస్తులు స్వీకరిసున్నట్లు చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు ఎస్ చరణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత రంగంలో విశిష్ట ప్రతిభ, నైపుణ్యం, విశిష్ట సేవలందించిన వారికి ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ అవార్డులు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాల కోసం www.handlooms.nic.in లేదా జిల్లా సహాయ సంచాలకుడు చేనేత, జౌళి శాఖ కార్యాలయం పొన్నం కాంప్లెక్స్, మంకమ్మ తోట, కరీంనగర్‌లో సంప్రదించాలని తెలిపారు.

## విద్యా సంవత్సరం ప్రారంభంలోగా

# పనులు పూర్తి చేయాలి

**కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**

ఆసిఫాబాద్ టౌన్, మే 16: వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి, మరమ్మతు పనులను పూర్తి చేయాలని అధికారులను కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. పాఠశాలల్లో అభివృద్ధి పనులపై గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ, డీఈవో అశోక్‌తో కలిసి విద్యా శాఖ అధికారులు, మండల నోడల్ అధికారులు, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని 685 ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులను విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోగా పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, విద్యుత్ సంబంధిత పనులు, నియంత్రిక బోర్డులు, ఫ్యాన్ల ఏర్పాటు తదితర పనులను పూర్తి చేయాలని తెలిపారు. బోర్ బావులకు మరమ్మతులు, ట్యాంకుల ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పాఠశాలల ప్రారంభంలోనే విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాల పంపిణీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో సురేందర్, విద్యాశాఖ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

# డెంగీ నివారణకు ప్రత్యేక చర్యలు

**మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్**

హాజీపూర్, మే 16 : జిల్లాలో డెంగీ వ్యాధి వ్యాప్తి చెందకుండా ప్రత్యేక చర్యలు, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. గురువారం మంచిర్యాల జిల్లాలోని హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి అనిత, సర్వైవ్‌లెన్స్ అధికారి ఫయాజ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'డెంగీ నివారణ మా బాధ్యత.. సురక్షితమైన రేపటి కోసం' అనే నినాదంతో జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే వర్షాకాలంలో సీజన్ వ్యాధుల నివారణకు ప్రజలు బాధ్యతగా కృషి చేయాలని తెలిపారు. వ్యాధి లక్షణాలుంటే వెంటనే సమీప ప్రభుత్వ దవాఖానకు వెళ్లి చికిత్స తీసుకోవాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కిట్ల ద్వారా ప్రాథమికంగా వ్యాధిని నిర్ధారణ చేసుకోవచ్చని తెలిపారు. జిల్లా దవాఖానలో టీ హబ్‌లో మళ్లీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు లహరి, ప్రశాంతి, ఎస్‌యూవోలు నామ్‌దేవ్, సత్యనారాయణ, రవీందర్, హెచ్ఈ అల్లాడి శ్రీనివాస్, మాస్ మీడియాధికారి బుక్క వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

# జూన్ 8న జాతీయ లోక్ అదాలత్

ఆసిఫాబాద్ టౌన్, మే 16 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కోర్టు భవన సముదాయంలో జూన్ 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకునేందుకు మంచి వేదిక అని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం మొదటి బెంచ్‌లో తాను, 2వ బెంచ్‌లో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే యువరాజ్, 3వ బెంచ్‌లో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జే అనంత లక్ష్మి న్యాయాధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు. దీనిపై శుక్రవారం జిల్లా కేంద్రంలోని కోర్టు భవన సముదాయంలోని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టు హాల్‌లో పోలీసు ఉన్నతాధికారులతో సన్నాహక సమావేశం ఉంటుందని వివరించారు.

# క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం

- ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.రమాదేవి
- వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభం

ఆసిఫాబాద్ టౌన్, మే 16 : క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం చేకూరుతుందని ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.రమాదేవి పేర్కొన్నారు. గురువారం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గిరిజన క్రీడా పాఠశాలలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.రమాదేవి ప్రారంభించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లోని ఆశ్రమ పాఠశాలకు చెందిన ప్రతిభ గల 120 మంది విద్యార్థులను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ వేసవి శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, ఏటీడీవో క్షేత్రయ్య, జైనూర్ ఏటీడీవో పురుషోత్తం, ఏసీఎంవో పుర్క ఉద్ధవ్, జీసీడీవో శకుంతల, క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్ కృష్ణారావు, హెచ్‌డబ్ల్యూవో విజయశాంతి, పీడీ కృష్ణమూర్తి, పీఈటీలు గుండం లక్ష్మణ్, పెందూరు మంగవతి, శ్రీనివాస్, సుభాష్, సుమలత, కోచ్‌లు విద్యాసాగర్ తిరుమల్ పాల్గొన్నారు.



క్రీడాకారులతో మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ ఆర్. రమాదేవి



మంచిర్యాలలో నిర్వహించిన రాస్తారోకోలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



చెన్నూర్‌లో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ ధర్నాలు**

# ధాన్యం ఏదైనా.. బోనస్ ఇవ్వాల్సిందే..

- మద్దతుగా తరలివచ్చిన అన్నదాతలు
- రూ.500 బోనస్‌పై సీఎం మాట మార్చడం సరికాదు
- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి



కాగజ్‌నగర్‌లోని వంజిరిలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

మంచిర్యాల, మే 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి గెలిచిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చడంపై అన్నదాతలు మండిపడుతున్నారు. ఈ సీజన్ నుంచే డబ్బులు ఇవ్వాలంటూ పట్టుబడుతుంటే.. సన్న ధాన్యం పండించినోళ్లకే బోనస్ ఇస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'రైతు భరోసా కింద రూ.15వేలు వేస్తా అన్నడు.. తీరా ఐదు ఎకరాల లోపు వారికే రైతు బంధు మాత్రమే వేసిండు. రెండు లక్షల రుణ మాఫీ అన్నడు వాయిదాల మీద వాయిదాలు వేస్తూ పోతున్నడు. పండించిన పంటకు ఇస్తామన్న బోనస్ విషయంలోనూ మాట మార్చిండు' అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే మాయ మాటలు చెప్పి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ సర్కార్ మోసం చేశారని ఏ రకం ధాన్యమైనా సరే రూ.500 బోనస్ ఇవ్వాల్సిందేనని అన్నదాతలు రోడ్డెక్కారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన ధర్నాలకు పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చి మద్దతు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ ధర్నాలకు అన్నదాతల నుంచి విశేష స్పందన వచ్చింది. వరి ధాన్యం కొనడంలో ఈ ప్రభుత్వం విఫలమైందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడ చూసినా ధాన్యం కుప్పలే కనిపిస్తున్నా కనీసం పట్టించుకోవడం లేదని వాపోయారు. ముందు ఇచ్చిన మాట ప్రకారం వరి సాగు చేసిన రైతులందరికీ బోనస్ ఇచ్చి తీరాల్సిందేనంటూ డిమాండ్ చేశారు. మంచిర్యాల ఐబీ చౌరస్తాలో బీఆర్ఎస్ నిర్వహించిన ధర్నాలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన ధర్నా బీఆర్ఎస్ నాయకులు రాజారమేశ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు వందలాది మంది రైతన్నలు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో రాస్తారోకోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

## ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లో నిరసనలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల్లో గురువారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన తెలుపుతూ రాస్తారోకోలు చేశారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆందోళనలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కాగజ్‌నగర్‌లో వంజిరి రహదారిపై నిర్వహించిన ఆందోళనలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ ధాన్యానికి రూ.500 బోనస్‌పై సీఎం రేవంత్ రెడ్డి పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఒకమాట..ఎన్నికల తర్వాత మరో మాట మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. సన్న రకం వడ్లకే బోనస్ ఇస్తామనడం రైతులను మోసం చేయడమేనని ఆరోపించారు. సాధ్యం కాని హామీలతో ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క వాగ్ధానాన్ని కూడా నెరవేర్చలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు రైతులకు రైతు బీమా, రైతు బంధు పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయారన్నారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు రైతులు పంటలు వేసే ముందే రైతు బంధు సాయం ఇచ్చేవారని, కాని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు పంటలు విక్రయించే సమయానికి కూడా అందించడం లేదన్నారు. ఇప్పటి వరకు రైతు భరోసా ఇవ్వలేదని, రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరపడ్డాయన్నారు. రైతు సంక్షేమం కోసం నిరంతరం పనిచేసే కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ ఉద్యమిస్తుందని తెలిపారు.



నెన్నెల : రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం కుప్పలపై పరదలు కప్పి అక్కడే ఉన్న రైతులు



సిర్పూర్(టీ) : మండలకేంద్రంలో కురుస్తున్న వర్షం

# వడ్లు కొంటరా..? కొనరా..?

- వరి పంట పండించుడా..? వద్దా..?
- రెండు వారాలుగా కొనకపోవడంతో తడిసిన ధాన్యం
- గొల్లపల్లిలో రైతుల నిరసన

నెన్నెల, మే 16: 'మా వడ్లు కొంటరా..? కొనరా..? వచ్చే సీజన్‌లో వరి పంట పండించుడా..? వద్దా..? మా ఊరిలో కొనుగోలు కేంద్రం ఎందుకు ఏర్పాటు చేయలేదు ?' అంటూ నెన్నెల మండలంలోని గొల్లపల్లి గ్రామస్తులు గురువారం నిరసన తెలిపారు. ఈ యాసంగిలో దాదాపు రెండు వందల ఎకరాలకుపైగా వరి సాగు చేశారు. కరెంటు కోతలు ఓ వైపు..నీళ్లు లేక కొందరి పంటలు ఎండిపోగా మిగిలిన పంటనైనా అమ్ముదామంటే కొనేవారు లేక పంట కల్లాల్లోనే ఉండి పోయింది. ఇటీవల రెండుసార్లు కురిసిన వర్షానికి ధాన్యం తడిసింది. గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని రైతులు తెలిపారు. కొన్నేళ్లుగా ఐకేపీ ద్వారా ధాన్యం కొనుగోలు చేశారని, ఈ సారి ఎందుకు ఏర్పాటు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రాత్రంతా ధాన్యం కుప్పలపై చేరిన వర్షపు నీటిని తొలగించాల్సి వచ్చిందని వాపోయారు. అధికారుల తీరుపై గురువారం ధాన్యం కుప్పల వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణతో ఫోన్‌లో మాట్లాడి ధాన్యం కొనుగోళ్లు చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరారు.



ధాన్యం కుప్పల నుంచి నీటిని తీస్తున్న రైతు

## సిర్పూర్(టీ)లో గంట పాటు వర్షం..

సిర్పూర్(టీ), మే 16 : సిర్పూర్(టీ) మండలంలో గురువారం సాయంత్రం గంట పాటు భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలు, బస్టాండ్ సమీపంలోని పలు కాలనీలు, ప్రధాన రహదారులపైకి వరద చేరింది. సిర్పూర్(టీ)–కౌటల ప్రధాన రహదారి పేట్ మహేశాకాలనీ వద్ద ఆర్అండ్‌బీ రోడ్డుపై గుంతల్లో నీరు చేరడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో మండల ప్రజలు ఇబ్బంది పడ్డారు. బుధవారం సాయంత్రం కూడా గాలి దుమారంతో దాదాపు నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

# నత్తనడకన అప్రోచ్ రోడ్డు పనులు..

చెన్నూర్ రూరల్, మే 16: చెన్నూర్ మండలంలోని సుద్దాల వాగుపై నూతన వంతెన ప్రారంభించి 6 నెలలైనా అప్రోచ్ రోడ్డు పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. కేసీఆర్ సర్కార్ హయాంలో ప్రభుత్వ విప్ బాల్క సుమన్ వంతెన నిర్మాణానికి రూ.10 కోట్ల నిధులను మంజూరు చేయించారు. ఆయన చొరవ తీసుకొని వంతెన పనులు వేగవంతం చేయించారు. ఏడాదిలోపు వాగుపై బ్రిడ్జి నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చారు. అక్టోబర్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా వంతెనను ప్రారంభించారు. ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బ్రిడ్జికి రెండు వైపులా చేపట్టిన అప్రోచ్ రోడ్డు పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. కేసీఆర్ సర్కార్ హయాంలో ఏడాదిలోపు బ్రిడ్జి పనులు పూర్తయ్యాయని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కనీసం అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి కాకపోవడం ఏమిటని సమీప గ్రామాల ప్రజలు అంటున్నారు. వర్షాకాలానికి ముందే అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి చేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



పూర్తి కాని సుద్దాల వంతెన అప్రోచ్ రోడ్డు

# నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**-మంచిర్యాల అదనపు కలెక్టర్ రాహుల్**


లక్షెట్టిపేట, మే 16: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న నిర్మాణ పనులు వేగవంతంగా నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంచిర్యాల అదనపు కలెక్టర్ రాహుల్ ఆదేశించారు. గురువారం లక్షెట్టిపేట మండలంలోని లక్ష్మీపూర్‌తో పాటు జెండా వెంకటాపూర్ జీపీ పరిధిలోని కొత్తపల్లిలో అమ్మ ఆదర్శ పాఠశాలను ఆయన పరిశీలించారు. పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెలాఖరు వరకు పనులు పూర్తి చేసి పాఠశాలను అప్పగించాలని ఆదేశించారు. పనులను అధికారులు పర్యవేక్షిస్తూ జాప్యం లేకుండా చూడాలన్నారు. అనంతరం ఐకేపీ ఆధ్వర్యంలో మహిళల ఉపాధి కల్పించేందుకు ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల పంచాయతీ అధికారి ప్రసాద్, ఐకేపీ ఏపీఎం విజయ లక్ష్మి తదితరులున్నారు.



కొత్తపల్లి పాఠశాల పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్

# చెరువు భూమిని కాపాడండి

తాండూర్, మే 16 : తాండూర్ మండలం ద్వారకాపూర్‌లోని రాంపూర్ కుంట చెరువు మత్తడి ముందు భాగంలో అక్రమంగా మట్టి తరలింపును అరికట్టాలని కోరుతూ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం తాండూర్ అధ్యక్షుడు కంపెల చిన్నయ్య, సంఘం సభ్యులు గురువారం నీటి పారుదల శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. చెరువు భూమి కబ్జా చేయడంతో పాటు కొంత మంది మట్టిని అక్రమంగా తరలించారని తెలిపారు. రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు సర్వే నిర్వహించి చెరువు భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం కార్యదర్శి ఉప్పుట్ల సంతోష్, సభ్యులు రాజేశం, రామయ్య, రవి, రమేశ్, నీలేశ్, భాస్కర్, మహేశ్, తదితరులు ఉన్నారు.



తాండూర్: చెరువులో మట్టి తరలించిన స్థలంలో గుంతలను చూపిస్తున్న మత్స్యకారులు